



అనంతపురంలో ఎన్టీఆర్ అభిమానిని బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

'అనంత'లో ఉద్రిక్తత

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ నిరసన
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
పోలీసుల లాఠీఛార్జి, అరెస్టులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పామిడి

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల నిరసనతో అనంతపురం జిల్లాలో ఆదివారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆయన ఫ్యాన్స్ నిరసనకు దిగారు. వెంకటేశ్వర ప్రసాద్ రెండు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు చేపడతామని ఇది వరకు ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నుంచి ఎటువంటి ప్రకటన లేకపోవడంతో జూనియర్ ఎన్టీఆర్‌కు క్షమాపణ చెప్పాలని కోరుతూ ఆయన ఫాన్స్ అనంతపురం నగరంలో ఆదివారం నిరసనకు దిగారు. రాయలసీమ జిల్లాల నుంచి ఆయన ఫ్యాన్స్ తరలివచ్చి నగరంలోని మారుతీనగర్‌లోనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. అయినా వెనక్కు తగ్గకపోవడంతో లాఠీఛార్జీ చేశారు. అనంతరం పలువురిని అరెస్టు చేసి టుటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఫ్యాన్సు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ తల్లిపట్ల అనుచితంగా మాట్లాడిన దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆయనపై తెలుగుదేశం పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రోజులు గడువు ఇచ్చినా ఎటువంటి స్పందనలేకపోవడంతో ఈ నిరసనకు దిగాల్సి వచ్చిందని చెప్పారు. అరెస్టులతో తమ నిరసనను ఆపలేరని చర్యలు తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

పామిడిలో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను అడ్డుకున్న పోలీసులు

పామిడి : అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇంటి ముట్టడికి వెళ్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను పోలీసులు ఆదివారం పామిడి వద్ద అడ్డుకున్నారు. అకస్మాత్తుగా వివిధ ప్రాంతాల నుంచి పామిడి మీదుగా అనంతపురంలోని ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి ఎన్టిఆర్ అభిమానులు వెళ్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా పామిడి వద్ద ఎన్టిఆర్ అభిమానులను ఆపి అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడికక్కడ ఆయా వాహనాలను పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. పామిడి,గుత్తి, వడుగూరు, గుంతకల్లు, తదితర ప్రాంతాల నుంచి ఎన్టీఆర్ అభిమానులు బ్యాచ్‌లు, బ్యాచ్‌లుగా రావడంతో అడ్డుకునేందుకు పోలీసులు నానాపాట్లు పడ్డారు. పోలీసులు అడ్డుకోవడంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే ప్రసాద్ వెంటనే తమ అభిమాన హీరోకు బహిరంగ క్షమాపణలు డిమాండ్ చేశారు.



పామిడి వద్ద ఎన్టీఆర్ అభిమానులను అడ్డుకుంటున్న పోలీసులు

అంగన్వాడీల మెడపై ఎఫ్ఆర్ఎస్ కత్తి

పని చేయని సెల్‌ఫోన్‌తో యాప్‌ల నిర్వహణ
వ్యతిరేకిస్తున్న అంగన్వాడీలు

చాలీచాలని వేతనాలు ఇస్తూ...వారితో వెట్టిచాకిరీ చేయించడమే కాకుండా...వారి మెడపై ఎఫ్ఆర్ఎస్(ఫేసియల్ రికగ్నేషన్ సిస్టం) కత్తి పెట్టడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని చేయని సెల్ ఫోన్లను ఇచ్చి ప్రభుత్వ యాప్‌లు అన్నీ అందులో ఇన్‌స్టాల్ చేసుకుని, ఎప్పటికప్పుడు అందులో ఆన్‌లైన్ చేయమంటే నెట్‌వర్క్ లేని ప్రాంతాలతో పాటు కనీసం 2జీ స్పీడ్ లేని ఫోన్‌లతో ఎలా చేస్తారన్న ఆలోచన సైతం ప్రభుత్వానికి లేదు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు ఆందోళనకు సిద్ధం అయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో అంగన్వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేశం 2జీ నెట్ వర్క్ నుంచి 5జీ స్థాయికి పరుగులు పెడుతోంది. అయితే అంగన్వాడీలకు ఇప్పటికి 2జీ సెల్ ఫోన్లను ఇచ్చారు. ఈ సెల్ ఫోన్‌లు అంగన్వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ సరిగా పనిచేయక పోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తవడం లేదు. దీంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5126 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల పరిధిలో 30 మండలాల్లో 2301, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 33 మండలాల్లో మెయిన్ సెంటర్‌లు 2198, మినీ సెంటర్‌లు 627 మొత్తం 2825 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిదిలో మెయిన్ సెంటర్లు 264, మిని సెంటర్లు 36 మొత్తం 330 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఇచ్చే బాల సంజీవని నుంచి కిశోర బాలికలకు, గర్భిణులు, బాలింతలకు వరకు పోషక ఆహారాన్ని అందిస్తున్నారు. వీటన్నింటిని యాప్ ద్వారానే అందించాలని ప్రభుత్వం నిబంధనలను తీసుకొచ్చింది.

సుమారు అరు నెలల క్రితం ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారమే గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోమ్ రేషన్ సేవలు పొందాలని షరతు పెట్టారు. అందుకోసం అంగన్వాడీలు మొబైల్ ఫోన్ ద్వారా మంత్రిత్వ శాఖ పోషణ్ యాప్‌లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. ఎఫ్ఆర్ఎస్‌లో రిజిష్టర్ కాని వారికి టేక్ హోం రేషన్ ఇవ్వబోరని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులను తొలగించాలని ఆదేశాలను జారీ చేసింది. ఐసిడిఎస్ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని రద్దు చేయాలని సిడిపిఒలు అంగన్వాడీ టీచర్లపై ఒత్తిడి చేస్తున్నారు. లేకుంటే ఉద్యోగం తొలగిస్తామని బెదిరిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని తొలగిస్తే అంగన్వాడీ వర్కర్లపై లబ్ధిదారులు గొడవకు దిగే అవకాశాలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఇటువంటి గొడవలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎఫ్ఆర్ఎస్ అయినా పూర్తి చేయాలని, లేకుంటే లబ్ధిదారులనైనా తొలగించాలని అంగన్వాడీలపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక అంగన్వాడీ వర్కర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పని చేయని సెల్ ఫోన్ లను సిడిపిఒలకు అందించారు. ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ ఎఫ్ఆర్ఎస్‌లో అంగన్వాడీ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌ను రెండు దశల్లో చేపట్టాలి. తొలుత మొబైల్‌లో లబ్ధిదారుల ఫొటో తీయాలి. రెండోది లబ్ధిదారుని ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఒటిపిని వెరిఫై చేయాలి. దీనిలో విఫలమైతే లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తారు. ఇటువంటి వారికి ఈ నెల ఒకటో తేదీ నుంచి టేక్ హోమ్ రేషన్ ఇవ్వవద్దని అంగన్వాడీ వర్కర్లకు ఆదేశాలు అందాయి. దీంతో గ్రామాల్లో చాలామంది ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని లబ్ధిదారులు అంగన్వాడీ వర్కర్లతో గొడవలకు దిగుతున్నారు.



పని చేయని సెల్‌ఫోన్లను చూపిస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు (ఫైల్ ఫొటో)

ఆహార భద్రత చట్టానికి తూట్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలతో పాటు చిన్నారులకు అందించే పోషక ఆహారాలను యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్‌తోనే ఇవ్వాలని నిబంధనలను తీసుకు రావడం అంటే కచ్చితంగా ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించడమే. గర్భిణులు, బాలింతలు, ఆర్నెల్ల నుంచి మూడేళ్ల పిల్లలకు అవసరమైన పోషకాహారాన్ని అందజేయాల్సిన అవసరాన్ని ఈ చట్టం తెలియజేస్తుంది. 2025-26 బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన మొత్తాన్ని న్యూట్రిషన్ కోసం ఖర్చు చేస్తుంది. కానీ నిధులను నిలిపివేస్తామని కేంద్రం బెదిరించడం వల్ల పీడీ, సిడిపిఒలు అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అంగన్వాడీ ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు తెలిసింది.

5జీ సెల్ ఫోన్, ట్యాబ్‌లు అందించాలి



అంగన్వాడీలను అధికారులు, ప్రభుత్వం బెదిరింపులను పాల్పడితే అంగన్వాడీల సత్తా ఏమిటో మరో సారి చూపించాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతాల్లో నెట్ వర్క్ సరిగా ఉండదు. దీనికి తోడు గతంలో ఎప్పుడో ఇచ్చిన సెల్ ఫోన్‌లలో 2జీ నెట్ వర్క్ వస్తోంది. దీంతో యాప్‌ల నిర్వహణతో పాటు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలంటే సాధ్యం కాదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే 5జి నెట్‌వర్క్ తో కూడిన సెల్ ఫోన్ లేదా ట్యాబ్ లను అందించడంతో పాటు గ్రామస్థాయిలో నెట్‌వర్క్‌ను పెంచాలి. ఇలా చేయకుండా బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేయాల్సి ఉంటుంది.

ఈఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకే

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తున్నాము. ఐసిడిఎస్‌లో అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్ఆర్ఎస్ నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. లబ్ధిదారులను తొలగించాలని ఎక్కడా చెప్పలేదు. లబ్ధిదారుల ఫొటోతో పాటు ఆధార్ కార్డు ఒటిపి సక్రమంగా అందిస్తే సరిపోతుంది.


వరలక్ష్మి
ఐసిడిఎస్ సిడిపిఒ

'పిఇటి'లో జిల్లా మొదటి ర్యాంకు

ఎస్‌జిటిలో మరొకరికి 4వస్థానం-సన్మానించిన ఎమ్మెల్యే, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు జిల్లాస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. నాయీబ్రహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఉమా మహేష్ వ్యాయయ ఉపాధ్యాయ పోస్టుల్లో జిల్లా మొదటి ర్యాంకు, హమాలీ యూనియన్ కుటుంబానికి చెందిన అనిల్‌కుమార్ ఎస్‌జీటీలో జిల్లా 4వ ర్యాంకు సాధించారు. ఈమేరకు ఆదివారం అనంతపురంలోని ఎస్ఆర్ కార్యాలయంలో ఉమామహేష్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఘనంగా సన్మానించారు. అలాగే సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్చుత్ ప్రసాద్, సివిల్ సప్లైయ్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌వి నాయుడు, తదితరులులు సివిల్ సప్లైయ్ యూనియన్ గోవిందప్ప కుమారుడు అనిల్‌కుమార్‌ను సన్మానించి అభినందించారు. పేద వర్గానికి చెందిన అభ్యర్థులు జిల్లాలో ఉత్తమ ఫలితం సాధించడం సంతోషమన్నారు.



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలకు పరిష్కారం చూపేరా .?

నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటికి ఏ మేరకు పరిష్కారాలను సోమవారం జరగబోయే జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో చూపనున్నారన్నది చూడాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభమైన జూన్, జులై నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పంటల సాగు కూడా 60 శాతం వరకే జిల్లాలో అయింది. ప్రధాన పంట వేరుశనగ అత్యల్పంగా సాగైంది.ఆగస్టులో మంచి వర్షాలొచ్చాయి. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగలేదు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచి ప్రత్యామ్నాయ పంటల సాగైనా పెరిగే అవకాశముంది. సాగు విస్తీర్ణం పెద్దగా పెరగపోయినా యురియా కొరత మాత్రం తీవ్రంగా ఉంది. రైతులకు యూరియా అందుబాటులో ఉండటం లేదు. అంచనాకు మించే జిల్లాకు యూరియా వచ్చినప్పటికీ రైతులకు మాత్రం దొరకడం లేదు.పక్కదోవ పట్టినట్టు ఆరోపణలున్నాయి. యూరియా కొరతపై ఈ సమావేశంలో ఎటువంటి చర్చ జరగనుందన్నది చూడాల్సి ఉంది. ఇక ఇప్పటి వరకు కూడా ఐఎబి సమావేశం జరగలేదు. అందులో అధికారులే కేటాయింపులు జరిపి నీటి విడుదలపై నిర్ణయం చేశారు. అయితే ఈ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో రైతుల వరకు తెలియకపోవడంతో మిడ్‌పెన్నార్ దక్షిణ, ఉత్తర కాలువ కిందనున్న ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. హంద్రీనీవాది అదే పరిస్థితి ఉంది. హంద్రీనీవా కింద ఆయకట్టుకు ఏ రకంగా నీరు ఇస్తారన్న దానిపైనా ఇప్పటికీ స్పష్టత లేదు. ఇక హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జరిగినప్పటికీ భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం పనులు భూసేకరణ వద్దనే ఆగిపోయాయి. ఈ పనుల పురోగతిపై ఈసమావేశంలో ఏ రకమైన చర్చ నడవనుందన్నది చూడాల్సి ఉంది. ఇటీవల వికలాంగుల పింఛను రద్దుపైనా పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. జిల్లాలో 21 శాతం పింఛన్లు రద్దయ్యాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వీటికి పరిష్కారం ఏమి చూపనున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రహదారులు, గృహ నిర్మాణా సమస్యలు అనేకం ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. ఈ సమీక్షలో వాటిన్నింటికి ఏరకమైన పరిష్కారా మార్గాలను చూపనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

నేడు డిఆర్‌సి

జిల్లా అభివృద్ధి కమిటీ (డిఆర్‌సి) సమావేశం నేడు జరుగనుంది. జిల్లా ఇంఛార్జ్ మంత్రి టిజి.భరత్ అధ్యక్షతన జరుగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవనంలో ఈ సమావేశం జరుగనుంది. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు. గతేడాది నవంబరు తొలి డిఆర్‌సి జరిగింది. అప్పటి నుంచి ఇప్పుడు తొమ్మిది మాసాల తరువాత రెండో డిఆర్‌సి జరుగనుంది.

50 మంది రక్తదానం

కళ్యాణదుర్గం టౌన్ : స్థానిక ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (బ్రహ్మకుమార్స్)లో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. ప్రకాష్‌మణిదాదాజీ జ్ఞాపకార్థం విద్యాలయ ఇన్‌ఛార్జి బికె కమలాక్షి, దుర్గం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు.

స్త్రీశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి. మధుసూదన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తద్వారా ఆదా పొందాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెడతామని హామీ ఇచ్చింది. అందులో స్త్రీ శక్తి పథకం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకం అమలుతో మహిళలు ఎంతో సంబరపడిపోతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, చిరు వ్యాపారాలు చేసే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగంగా ఉందని జిల్లా వ్యాప్తంగా మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక జిల్లాకే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా మహిళలు ఏదేని గుర్తింపు కార్డు చూపించి ప్రయాణించవచ్చు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల వివరాలు ఎన్ని బస్సులు ఈ పథకానికి అందుబాటులో ఉన్నాయన్న విషయాలపై శ్రీ సత్య సాయి జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని బస్సులు ఉన్నాయి? స్త్రీ శక్తి పథకానికి ఎన్ని బస్సులు వినియోగిస్తున్నారు? మహిళా ప్రయాణికుల వివరాలు తెలపండి?

జవాబు: జిల్లాలో మొత్తం 360 బస్సులు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర బస్సుల డిపోల ద్వారా 315 బస్సులు స్త్రీ శక్తి పథకానికి వినియోగిస్తున్నారు. ఈనెల 15న ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈనెల 22వ తేదీ వరకు ఎనిమిది రోజుల్లో 5,08,910 మంది మహిళలు ప్రయాణించి రూ.1,85,41,814ల ఆదాయం పొందారు.

ప్ర: మహిళలు ఏయే బస్సులలో ప్రయాణించవచ్చు ? కొన్నిచోట్ల బస్సులు నిలపడం లేదనే ఆరోపణలున్నాయి ?

జ : అంతర్ రాష్ట్రాలకు వెళ్లే బస్సులు, సూపర్ లగ్జరీ, నాన్ స్టాప్ బస్సులు మినహాయించి ఇతర ఏ బస్సులో అయినా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. బస్సులు నిలపడం లేదనే సమస్య ఉండదు. అప్పటికే బస్సులలో రద్దీగా ప్రయాణికులు ఉంటే నిలబెట్టకుండా వెళ్లి ఉండవచ్చు. ఎక్కడ స్టాపింగ్ ప్రదేశం ఉంటే అక్కడ తప్పనిసరిగా బస్సు నిలపాల్సిందే. ఇదే విషయం పై డ్రైవర్, కండక్టర్లకు తగిన సూచనలు ఇచ్చాము. ఒకవేళ ఎక్కడైనా అలాంటి సంఘటనలు ఎదురైతే ఆయా డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటారు. అంతేగాక ఎక్కడైనా ప్రయాణికులు ఎక్కువగా ఉంటే అక్కడికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తాం.



ప్ర : జిల్లాలో ఏయే ప్రాంతాలకు అంతర్ రాష్ట్రాలకు బస్సులు నడుపుతున్నారు?

జ : జిల్లాలోని ఆరు డిపోల ద్వారా స్త్రీ శక్తి పథకానికి 315 బస్సులు పోను మిగతా 45 బస్సులు నగరాలకు నడుస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ, నెల్లూరు. తిరుపతి, విజయవాడ. ఒంగోలు, కడప, కర్నూలు. నంద్యాల, శ్రీశైలం తదితర ముఖ్యమైన పట్టణాలకు బస్సులు నడుపుతున్నాము. అంతర్ రాష్ట్రాలైన బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, అరుణాచలం తదితర అంతర్ రాష్ట్రాల ముఖ్య నగరాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాము.

ప్ర : ఆర్టీసీ లాభాల బాటలో నడపడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ముఖ్యంగా డీజిల్ ఆదాతో పాటు, కార్గో ద్వారా వస్తువులు, లగేజ్ పంపుతూ ఆదాయం మార్గాలను చేపడుతున్నాము. డీజిల్ ఆదా, అధిక కలెక్షన్ తెస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక శిక్షణతో పాటు ప్రతి ఏటా ఆదాలో ప్రతిభ చూపించిన సిబ్బందికి నగదు ప్రోత్సాహ బహుమతులు అందించడం జరుగుతోంది. సమయపాలన పాటించడం పై కూడా చర్యలు తీసుకుంటున్నాము.



ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్

ప్ర : మహిళా ప్రయాణికులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ : ఆర్టీసీ సంస్థ ప్రజలది, అందరిదీ అని ప్రయాణికులు గుర్తించాలి. క్షేమంగా గమ్యానికి చేరుకోవడానికి ఆర్టీసీ లోనే ప్రయాణించి సంస్థ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి. ఆర్టీసీలో ప్రయాణం క్షేమంగా ఉంటుంది. ప్రయాణికులకు సౌకర్యంగా ఆయా డిపోలు, బస్టాండ్లలో ముందస్తుగా టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాము. ప్రతి బస్టాండ్ లోను ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు కల్పించడంతోపాటు పరిశుభ్రత పాటించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాము. పుణ్యక్షేత్రాలకు సైతం ప్రయాణికులు ముందుగా బుకింగ్ చేసుకుంటే ప్రత్యేక బస్సులు నడుపుతాము. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆదా పొందాలని కోరుతున్నాము.

రోడ్లన్నీ గుంతలమయం

పట్టించుకోని అధికారులు - వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లాలంటే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా చింతకుంట నుంచి కడవకల్లుకు వెళ్లే రహదారి, నారాయణరెడ్డిపల్లి నుంచి సాలవేముల, పుట్లూరు నుంచి తక్కలపల్లి, తక్కలపల్లి నుంచి గార్లపాడు గ్రామాలకు వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2010లో అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీమంత్రి శైలజనాథ్ ఆధ్వర్యంలో ఆయా రోడ్లు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రోడ్ల మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంతోపాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్అండ్‌బి రోడ్లకు మాత్రమే మరమ్మతులు చేశారు. కానీ పంచాయతీరాజ్ రోడ్లకు మాత్రం మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయించడంతోపాటు రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.




రోడ్డులో భారీగా ఏర్పడిన గుంతలు

ప్రజాశక్తి www.prajasakti.com

మహిళల ఆర్థికాభివృద్ధే 'కూటమి' లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ నుంచి శింగనమల మరకూ మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో వచ్చారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళనూ ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ అన్ని విధాలుగా తోడుగా నిలుస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కి నియోజకవర్గ మహిళల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే ఓర్చుకోలేని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు, అపనిందలు వేస్తున్నారన్నారు. అలాంటి ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మారుతీనాయుడు, దండు శ్రీనివాసులు, మట్లగొంది అనిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

'ఎస్ఆర్ఐటి' కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి



అతిథులకు పూలమొక్కలు అందజేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) లక్ష్యమని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలూరు సాంబశివరెడ్డి అన్నారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటిలో మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థుల కోసం ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమృద్ధమైన విద్యా వారసత్వం, నాణ్యమైన విద్య అందించాలనే దృఢ సంకల్పమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలు తెచ్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో లభించే వనరులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. అత్యంత నైపుణ్యంతో కూడిన అధ్యాపకుల సాయంతో విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎం.రంజిత్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్ ఇవస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఉమ్మడి జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబిపిటిఎ ప్రసాద్ ఆదేశాల మేరకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆరు దుకాణాల్లో తనిఖీలు చేసి ఈపాస్ మిషన్‌లో ఉన్న నిల్వలు, స్టాకు నిల్వల్లో తేడాలు ఉండటంతో రూ.15.37 లక్షల విలువజేసే వివిధ రకాల 60.18 ఎంటిఎస్ ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా యూరియా కృత్రిమ కొరత సష్టించడం, అధిక ధరకు అమ్మడం, స్టాకు ఉన్నా నో స్టాక్ బోర్డు పెట్టడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాసులు, ఎస్.జమాల్‌బాషా, వాసుప్రకాష్, బి.సురేష్‌కుమార్, జి.గోపాలుడు, ఎస్.నరేంద్ర భూపతి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంతోపాటు రెడ్డిపల్లి గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా అన్నదాత సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, ఉమేష్ చంద్ర ఫర్టిలైజర్స్, శ్రీ మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిల్వల్లో తేడాలు రావడంతో తనిఖీ చేసి రూ.1,80,790.50 విలువజేసే ఎరువులను అమ్మకాలు చేపట్టకుండా నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో ఇన్స్‌పెక్టర్ జమాల్‌బాషా, సబ్ ఇన్స్‌పెక్టర్ నరేంద్రభూపతి, విజిలెన్స్ వ్యవసాయధికారి వాసుప్రకాష్, మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్, తతదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు నిబంధనలు తప్పనిసరి



విలేకరులతో మాట్లాడుతున్న సిఐ యువరాజ్

కళ్యాణదుర్గం టౌన్ : ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఆయా కమిటీల సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పట్టణ సిఐ యువరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. ముందుగా ఐదుగురికిపైగా కమిటీ సభ్యులుగా ఏర్పడి స్థలానికి సంబంధించిన హక్కుదారులతో అనుమతులు పొందాలన్నారు. తర్వాత ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లోగానీ పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖతోపాటు ఫైర్, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు కూడా తప్పనిసరి అన్నారు. మూడు రోజులు ఉత్సవాలు ముగిసేదాకా కమిటీ సభ్యులు మండపం వద్దే ఉండాలని, ఏదైన సమస్య జరిగితే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అల్ట్రాసౌండ్ సాంకేతిక వర్క్‌షాప్ విజయవంతం



కార్యక్రమాన్ని పారంభిస్తున్న అతిథులు

అనంతపురం : అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ (ఎఒజిఎం) ఆధ్వర్యంలో అనంతపురంలోని ఐఎంఎ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆధునిక అల్ట్రాసౌండ్ సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్‌షాప్ విజయవంతమైంది. ముఖ్య అతిథులుగా హాజరైన హైదరాబాద్ నుంచి డాక్టర్ ఆర్తి దీనదయాల్, డాక్టర్ శిల్ప, తదితరులు ఆధునిక అల్ట్రాసౌండ్ పద్ధతులపై విలువైన జ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధ, డాక్టర్ వివేక్, డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ అరుణ, కార్యదర్శి డాక్టర్ నిస్సీ వినూత్న, డాక్టర్ నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



మహాసభలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-తాడిపత్రి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ విమర్శించారు. ఆదివారం పట్టణంలో సిఐటియు కార్యాలయంలో సిఐటియు పట్టణ 4వ మహాసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా సిఐటియు సీనియర్ నాయకురాలు జ్యోతిలత జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పూర్వం కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికుల సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ వల్ల తాడిపత్రి పట్టణ పరిసరాల్లో అనేక సిమెంటు, స్టీలు పరిశ్రమల్లో పని చేసే కార్మికులు భద్రత కోల్పోతారన్నారు. వీరితోపాటు బీడీ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు కూలిరేట్లు, ప్రమాద బీమా కల్పించడం లేదన్నారు. అలాగే స్కీమ్‌వర్క్ రంగంలో పని చేస్తున్న కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఆయా సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణం, అధ్యక్ష, కార్యదర్శులు అంజి, జగన్మోహన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, హనుమంతురెడ్డి, జ్యోతిలత, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

గుంతకల్లు : పోరాటాలతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్ల పట్టణ 4వ మహాసభ నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచడం లేదన్నారు. అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి ఇవ్వకుండా, సంక్షేమ పథకాలు వర్తింపజేయకుండా నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నరసయ్య, అధ్యక్షులు శామ్యూల్, ప్రధాన కార్యదర్శి రంగనాయకులు, కోశాధికారిగా రవి, సభ్యులను ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

తెలుగు తమ్ముళ్ల మధ్య 'రచ్చకట్ట' పంచాయితీ

దేవాదులకొండలో వినాయక మండపం వివాదం - పోలీసులకు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్ గొడవ పడుతున్న ఇరువర్గాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండలో టిడిపి తమ్ముళ్ల మధ్య రచ్చకట్ట అభివృద్ధి వివాదం చోటు చేసుకుంది. ఈవిషయంలో టీడీపీ సోషియల్ మీడియా కార్యకర్త పవన్‌యాదవ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టీడీపీలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఆదివారం ఏకంగా పట్టణ పోలీస్‌స్టేషన్‌కు రచ్చకట్ట పంచాయితీ చేరింది. వివరాల్లోకి వెళ్లితే.. దేవాదులకొండలోని కూడలిలో వేపచెట్టు కట్ట ఉంది. గొల్ల గోవిందరాజులు అన్నదమ్ములు కట్ట అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కట్టను సిమెంట్‌తో భద్రం చేసి ఇనుపరాడ్లతో శాశ్వత మండపం ఏర్పాటు చేయడానికి పనులు చేపట్టారు. దీంతో రచ్చకట్టను ఆక్రమిస్తున్నారంటూ టీడీపీకి చెందిన గోవిందరాజులు అన్నదమ్ములపై మరో టిడిపి సోషియల్ మీడియా కార్యకర్త పవన్ వాదనకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నీదేముందంటే... నీదేముందంటూ... నిలదీసుకున్నారు. రెండు వర్గాల వారు టీడీపీకి చెందిన వారు కావడంతో రచ్చకట్ట పంచాయితీ ఆసక్తికరంగా మారింది. ఎవరికివారు ధీమాతో ఫంతం నెగ్గించుకునేందుకు పాకులాడుతున్నారు. రచ్చకట్ట అభివృద్ధి కేవలం వినాయక చవితి విగ్రహం ఏర్పాటుకు శాశ్వతంగా మండపం ఉండేలా పనులు చేపట్టగా పవన్‌యాదవ్ అటకాయింపు చేయడంపై గోవిందరాజుల అన్నదమ్ములు తీవ్రంగా మండిపడ్డారు. చవితి ఉత్సవాలు మరో రెండురోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో దేవాదుకొండలో టిడిపి నాయకుల మధ్య చోటు చేసుకున్న రచ్చకట్ట ఆధిపత్యపోరు పోలీసులకు తలనొప్పిగా మారింది. గ్రామంలో సమస్యలు ఉత్పన్నం కాకూడదని ఇందుకు అందరూ పెద్ద మనుస్సులు ఆలోచనచేయాలని పోలీసులు హితబోధ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో రెండు వర్గాల వారు తీవ్ర వాగ్వాదానికి దిగడంతో పోలీసులు అందరినీ చెదరగొట్టారు. గ్రామం సందర్శించి వాస్తవాలు పరిశీలిస్తామని అంతవరకు ఎవరూ గొడవలకు దిగవద్దని పట్టణ పోలీసుల సర్దిచెప్పారు.

మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సభ్యత్వం



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ)లో మెడికల్ కాంటాక్ట్ ఉద్యోగులు సభ్యత్వం తీసుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు బి.గోపీకృష్ణ, ఎస్.రామునాయక్, మెడికల్ కాంటాక్ట్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాంబశివమ్మ తెలిపారు. ఆదివారం ఎపిజిఇఎ జిల్లా కార్యాలయంలోజిల్లా మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది ఉద్యోగులు సభ్యత్వం స్వీకరించారు. అనంతరం మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా యు.విశ్వనాథ్, కోశాధికారిగా ఎ.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా హనుమంతురాయుడు, లక్ష్మీదేవి, డి.రామ సుబ్బమ్మ, సహాయ కార్యదర్శులు పి.కేశవరాజు, జి.ప్రతాప్, ఇసి సభ్యులుగా ఫక్రుద్దీన్, ఎం.రామాంజులమ్మ, కె.హేమలతను ఎన్నుకున్నారు.

26న ఉచిత

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఉరవకొండ : ఈనెల 26వ తేదీన వినాయక చవితి పండుగన పురస్కరించుకుని మట్టి ప్రతిమలతో పాటు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.పవన్‌కుమార్, టి.సుమలత దంపతుల పిల్లలు టి.ఓమిశా, టి.ఓమాన్స్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానికఫైర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న జై కిసాన్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత మట్టి వినాయక ప్రతిమలు, మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు పంపిణీ చేసి నాటడంతోపాటు వాటిని కాపాడాల్సిన బాధ్యత కచ్చితంగా తీసుకోవాలని సూచించారు.

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయదుర్గం జోనల్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. పట్టణ అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎంజమల్లికార్జున, రాయదుర్గం మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టి.సునీల్, గుమ్మగట్ట మండలం అధ్యక్షులుగా పాండురంగ, ప్రధాన కార్యదర్శిగా సిద్దేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రవేశ పరీక్ష విధానం అస్తవ్యస్తంగా ఉందన్నారు. పాత పద్ధతిని కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, మధ్యంతర భృతి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆనందరావు, రామాంజనేయులు, మల్లన్న, అనిల్‌కుమార్, ఖాసీంపీరా, కెపి రమేష్, రాజు, సురేష్, మల్లికార్జున, కృష్ణమూర్తి, ఎం.తిప్పేస్వామి, బి.నాగరాజు, వన్నూరుసాబ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీలతో పార్టీ బలోపేతం

కళ్యాణదుర్గం టౌన్ : వైసీపీ వార్డు, గ్రామస్థాయి కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నీరుగంటి సురేష్, కౌన్సిలర్ గోపారం శ్రీనివాసులు, బ్రహ్మసముద్రం మండల పార్టీ కన్వీనర్ చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు తిరుమల వెంకటేశులు, విద్యార్థి నాయకుడు షెక్షావలి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 20వ వార్డులో సమన్వయకర్త రంగయ్య ఆదేశాల మేరకు నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మసాల రవి, ప్రధాన కార్యదర్శులుగా రియాజ్, ఉయద్, కటిక శంకర్, జిలాన్, కార్యదర్శులుగా బూదురు గంగాధర్, సునీల్, సాయి, కటిక మణి, అబ్దుల్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వెలుగు నాగరాజు, బోరంపల్లి రామిరెడ్డి, దేవ, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ సహకారంతో నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆదివారం పేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. నగర శివారులోని అంజనమ్మ వారి కుమారుడు మేస్త్రీ పని చేస్తూ 15 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డాడు. దీంతో మెడకు కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న నిర్మలమురళి ఆదివారం పుట్టినిల్లు ఆశ్రమంలో రెండు నెలలకు సరిపడా 37 రకాల నిత్యవసర వస్తువులతో పాటు ఒక బియ్యం ప్యాకెట్ అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకం కోల్పోతున్న 'కూటమి'

వైసిపి రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామి



కరపత్రాలు అందజేస్తున్న వైసిపి నాయకులు


ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎన్నికల ముందు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోతోందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామి విమర్శించారు. ఆదివారం ఆదివారం శెట్టూరు మండల పరిధిలోని ఐదుకల్లు, చిన్నంపల్లి గ్రామాల్లో వైసిపి మండల కన్వీనర్ హనుమంతురాయుడు ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సోమనాథరెడ్డి, ఐదుకల్లు సర్పంచు విరూపాక్షిగౌడ్, ఎంపిటిసిలు నగేష్, నరసింహులు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు శెట్టూరు తిప్పేస్వామి, చిన్నంపల్లి గిరి, మాజీ సర్పంచు సోమశేఖర్, మహిళా విభాగం అధ్యక్షులు మంజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని సూరసింగనపల్లికి చెందిన వైసిపి సీనియర్ నాయకురాలు చంద్రగిరి రాధాయాదవ్ అనంతపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో రక్తదానం చేశారు. అనంతపురం నగరంలో వినాయక చవితిని పురస్కరించుకుని బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి రాధా యాదవ్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు నిర్వాహకులు ప్రశాంశపత్రం అందజేశారు.

తుంపెర భాస్కర్‌రెడ్డికి డీఎస్సీలో 11వ ర్యాంకు



తల్లిదండ్రులతో భాస్కర్‌రెడ్డి

నార్పల : మండల పరిధిలోని తుంపెర గ్రామానికి చెందిన నుస్సం భాస్కర్‌రెడ్డి డీఎస్సీ ఫలితాల్లో 84.5లతో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో 11వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ తమది గ్రామీణ ప్రాంతమైనా తల్లిదండ్రులు కష్టపడి చదివించారన్నారు. తన విజయంలో అక్క, బావ, మిత్రుడు సూర్య ప్రోత్సహం మరువలేనిదన్నారు. వీరందరూ ఏ అవసరమున్నా కాదనకుండా సహకారం అందించారన్నారు. వారి సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు.

కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం కార్పొరేషన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పార్కులో ఆదివారం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కెఎ రత్నయ్య, అధ్యక్షులుగా సరిపూటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా జి.మురళీమోహన్‌రెడ్డి, కె.ప్రీతంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.తరుణ్‌కుమార్, సహ కార్యదర్శులు సి.ఇస్మాయిల్, వై. లక్ష్మీనారాయణ, ట్రెజరర్లుగా శ్రీనివాసులు, వి.రామకృష్ణ, అడ్వైజర్లుగా కె.వేణుగోపాల్‌రెడ్డి, ఎన్.వెంకటేష్, ఎ.శివయ్య, ఎం.ప్రభాకర్‌రావు, కె.సత్యనారాయణ ఎన్నికయ్యారు.

గణేష్ ఉత్సవాలపై సమావేశం

యాడికి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఈరన్న మాట్లాడుతూ పోలీసుల నిబంధనల మేరకు ఉత్సవ కమిటీల సభ్యులు నడుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా పండుగ జరుపుకునేందుకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, బీసీ సెల్ మండల అధ్యక్షులు తీరంపురం నీలకంఠ, వడ్డెర సంఘం మండల అధ్యక్షులు రామాంజనేయులు, విశాలాక్షి సంస్థ గుండా నారాయణస్వామి, వార్డు సభ్యులు పరమేశ్వర్‌రెడ్డి మాయకుంట్ల నారాయణస్వామి, మండల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

రాయదుర్గం : నూతనంగా ఎన్నికైన రాయదుర్గం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గంతో ఆదివారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఛైర్మన్ శంకర్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ సంవత్సరం సందర్భంగా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మూడు నెలలకు ఒకసారి కంటి ఆపరేషన్ల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా తాయి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జయంతి శ్రీనివాసులు, అబ్దుల్లా, కార్యదర్శి పోరాలు ధనార్జన, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, క్లబ్ పూర్వ అధ్యక్షులు అంబాజీరావు, పూర్వ కార్యదర్శి అశోక్ కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

104వసారి రక్తదానం చేసిన 'సాయి'



ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయికుమార్

అనంతపురం : సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ 104వ సారి రక్తదానం చేశారు. గిన్నిస్ బుక్‌లో చోటు సాధనలో భాగంగా ఎన్టీఆర్ ట్రస్టు, బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం వారు ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1990 నుంచి తాను రక్తదానం చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికి 104వసారి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శైలజ, ఎన్టీఆర్ ట్రస్టు సభ్యులు, ఓంశాంతి సిస్టర్ పాల్గొన్నారు.

ఒపిఎస్ సాధన ధర్నాకు మద్దతు

అనంతపురం : డీఎస్సీ ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధనకు విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్), రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) సంపూర్ణ మద్దుతు ఇస్తున్నట్లు వ్యవస్థాపకులు పోతుల నాగరాజు, ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణనాయక్ తెలిపారు. ఈమేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 ద్వారా పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. ఇందుకోసం ఈనెల 25న విజయవాడలో చేపడుతున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ జాతీయ కన్వీనర్ జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు టి.రాజారమేష్, తదితరులు పాల్గొన్నారు.


ఎపి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పురుషోత్తం

ఉరవకొండ : ఎపి ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉరవకొండకు చెందిన సాకే పురుషోత్తం ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ తన ఎన్నిక సహకరించిన ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎరుకల సేవా సంఘాన్ని బలోపేతం చేయడానికి సమాజాభివృద్ధిలో కమిటీ నాయకులు సభ్యులతో సమన్వయం చేసుకుంటూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలకు భద్రత ఏదీ?

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు భద్రత కరువైంది. ముఖ్యంగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయానికి గేట్లు వేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా ఉన్నత పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎంఇఒ కార్యాలయానికి గేట్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



రెండు రోజులుగా వేయని గేటు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం : కళ్యాణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్‌కు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన ఈడిగ పాండు (42) ఆదివారం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. గత గురువారం మాత్రల కోసం బయటకు వచ్చిన పాండు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరారు. తొలుత అనంతపురంలో సీరియస్‌గా ఉందని చెప్పడంతో బెంగళూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో సర్వజన ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై కుటుంబ సభ్యులు ఉంచారు. అయితే పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం ఓ రైతు పాముకాటుకు గురయ్యాడు. గ్రామానికి చెందిన భోగేశ్వరరెడ్డి తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి రైతులు పామును చంపివేశారు. పాముకాటుతో అస్వస్థతకు గురైన రైతు భోగేశ్వర రెడ్డిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని దొంగ చోరీ చేసి తీసుకెళ్లాడు. ముందుగా రైల్వే స్టేషన్ వెళ్లు దారిలో చర్మకారుడు కుళ్లాయికి సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశాడు. మద్యం దుకాణం వద్దకు వెళ్లి అక్కడ ఆ ద్విచక్రవాహనాన్ని ఉంచాడు. మద్యం బాటిల్ కొనుగోలు చేసి అక్కడ పనిచేసే సేల్స్‌మెన్ తులసి నూతన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.